క్లుప్తంగా

రామతీర్థంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



గాయత్రీ మాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఆస్పరి: మండల కేంద్రంలోని రామతీర్థంలో వెలసిన రామలింగేశ్వరస్వామి, గాయత్రీదేవి ఆలయాల్లో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు దత్తాత్రేయరెడ్డి, సంజీవరెడ్డి ఉన్నారు.

ఆలూరులో మోస్తరు వర్షం



ఆలూరులో కురుస్తున్న వర్షం

ఆలూరు రూరల్: వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. శనివారం రాత్రి ఆలూరు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చగా.. సాయంత్రం ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. దీంతో కొంత మేర వాతావరణం చల్లబడింది. ఈదురు గాలులు లేకపోవడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. ఈ వర్షంతో రైతుల్లో ఆనందం నెలకొంది. వర్షం రాకతో ఖరీఫ్ దుక్కులు మరింత వేగంగా సాగుతున్నాయి.

మురుగు సమస్య పరిష్కారం



ఎస్సీ కాలనీలో మురుగును తొలగిస్తున్న సిబ్బంది

చిప్పగిరి: స్థానిక ఎస్సీ కాలనీలో మురుగు సమస్యను అధికారులు ఆదివారం పరిష్కరించారు. గ్రామంలోని పలు కాలనీల నుంచి మురుగునీరు ఎస్సీ కాలనీలోని కుంటలోకి చేరి దుర్వాసన వ్యాపిస్తోంది. కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేంద్ర మోటార్ ద్వారా గ్రామం వెలుపల ఉన్న వంకలోకి తరలించారు. నీరు నిల్వ చేరకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ముళ్లకంపలు తొలగించరూ



బెల్డోణ గ్రామం వద్ద రోడ్డుపైకి వచ్చిన ముళ్లకంప చెట్లు

చిప్పగిరి: మండలంలో ప్రధాన రహదారిగా ఉన్న ఆలూరు, గుంతకల్లు రోడ్డుపైకి కంపచెట్లు అలుముకుని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కుందనగుర్తి గ్రామం నుంచి మొదలుకొని రామదుర్గం గ్రామం వరకు ఇదే పరిస్థితి. సగం రోడ్డుకు కంపచెట్లు చెట్లు రావడంతో మిగిలిన సగం రోడ్డులోనే ప్రయాణించాల్సి వస్తోందని.. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనాదారులు ఆవేదన చెందుతున్నారు. రోడ్డుపైకి వచ్చిన ముళ్లకంప చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

ఎన్నికల ఫలితాలను వ్యక్తిగతంగా తీసుకోవద్దు



మాచనూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హాలహర్వి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ఎవరూ వ్యక్తిగతంగా తీసుకోవద్దని ఎస్‌ఐ నరేంద్ర సూచించారు. ఆదివారం మండలంలోని నిట్రవట్టి, అర్ధగేరి, మాచనూరు గ్రామాల్లో పర్యటించారు. ప్రజలతో సమావేశమై మాట్లాడారు. 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎవరూ గుంపులుగా తిరగరాదన్నారు. ఎవరైనా హింసకు పాల్పడినా, అల్లర్లు, గొడవలు సృష్టించినా సహించేది లేదన్నారు. కౌంటింగ్ ముందు రోజు, కౌంటింగ్ తర్వాత కూడా శాంతియుతంగా, ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎన్నికలు అనేవి దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పండుగ అని, ప్రజాస్వామ్య పండుగ స్ఫూర్తికి ఎవరూ భంగం కలిగించొద్దని సూచించారు. ఎగ్జిట్ పోల్స్ వచ్చినందున అందరూ సంయమనం పాటించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్ అల్లప్ప ఉన్నారు.

ఆ రెండు మండలాలే కీలకం

- అభ్యర్థుల గెలుపులో కీలకం కానున్న ఆస్పరి, దేవనకొండ
- 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడి నుంచి వైఎస్సార్‌సీపీకి మెజారిటీ
- 21 రౌండ్లలో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- రేపు రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్
- హ్యాట్రిక్ గెలుపుపై ధీమాగా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఆస్పరిలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు (ఫైల్)

ఆలూరు రూరల్: ఆలూరు అసెంబ్లీ ఎన్నికల ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మే 13వ తేదీ ఎన్నికలు ముగిశాయి. కౌంటింగ్‌కు మరో 24 గంటలే సమయం ఉంది. నియోజకవర్గంలో మొత్తం 2,58,997 మంది ఓటర్లు ఉండగా, ఈ దఫా ఎన్నికల్లో 2,09,080 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 80.72 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో మహిళలు భారీ ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేశారు. మంగళవారం కర్నూలులో కౌంటింగ్ నిర్వహించనున్నారు. 2024 ఎన్నికల్లో ఆలూరు నుంచి వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయం నమోదు చేస్తుందని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీదే పైచేయి

ఆలూరు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నియోజకవర్గంలోని ఆస్పరి, దేవనకొండ మండలాలు కీలకం కానున్నాయి. ఈ రెండు మండలాల్లో వచ్చే ఓట్ల ఆధారంగా అభ్యర్థి గెలుపు, మెజారిటీ తేలనుంది. ఆస్పరి మండలంలో 52,821 మంది ఓటర్లు ఉండగా, 43,115 మంది ఓటు వేశారు. 81.62 శాతం పోలింగ్ జరిగింది. దేవనకొండ మండలంలో 58,359 మంది ఓటర్లు ఉండగా, మే 13న జరిగిన పోలింగ్ రోజు 47,194 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.86 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. నియోజవర్గంలోని ఆరు మండలాల్లో 2,58,997 మంది ఓటర్లు ఉండగా, ఈ రెండు మండలాల్లోనే 1,05,553 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఇక్కడి నుంచి 90,309 మంది ఓటు వేశారు. 2014 ఎన్నికల్లో ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద నాలుగు మండలాల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి టీడీపీ పైచేయి సాధించి ఉండగా.. ఆస్పరి, దేవనకొండ మండలం నుంచి వైఎస్సార్‌సీపీకి అత్యధికంగా ఓట్లు రావడంతో వైఎస్సార్‌సీపీ 5 వేలకు పైగా మెజారిటీ సాధించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆస్పరి, దేవనకొండ మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ 39 వేలకు పైగా ఓట్లతో విజయ ఢంకా మోగించింది. ముచ్చటగా మూడోసారి ఆలూరు అసెంబ్లీ కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తుందని ఆ పార్టీ నాయకులు విశ్లేషిస్తున్నారు.

21 రౌండ్లలో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

ఆలూరు నియోజకవర్గం పరిధిలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, దేవనకొండ మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 294 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 2,09,080 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆలూరుకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో జరగనుంది. కౌంటింగ్‌కు సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 21 రౌండ్లలో ఫలితం తేలనుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ హొళగుంద మండలంలోని గజ్జహళ్లి పోలింగ్ కేంద్రం నుంచి ప్రారంభమై..దేవనకొండ మండలం బండపల్లి గ్రామం పోలింగ్ కేంద్రంతో ముగియనుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి అనంతరం ఈవీఎంలను లెక్కిస్తారు.

అప్పుడు కాంగ్రెస్.. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ

ఆలూరు: ఈ నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ వైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ 9 సార్లు గెలుపొందింది. ఆ తర్వాత టీడీపీ 3 సార్లు విజయం సాధించింది. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ నాయకులే గెలుపొందుతున్నారు. 2009లో ఈ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ స్థానం నుంచి జనరల్ కేటగిరికి మారింది. 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడుపై 1919 ఓట్ల మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం విజయం సాధించారు. 2019లో కోట్ల సుజాతమ్మ టీడీపీ నుంచి బరిలో దిగినా ప్రయోజనం లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుమ్మనూరు జయంరాం చేతిలో 39,896 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఈ ఎన్నికల్లో మరోసారి వీరభద్రగౌడ్ టీడీపీ నుంచి బరిలో దిగారు. వైఎస్సార్‌సీపీ నుంచి బుసినే విరుపాక్షి పోటీ చేస్తున్నారు. హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఆ పార్టీ నాయకులు ధీమాతో ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మద్దికెర: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని.. అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత వల్ల అంటురోగాలు ప్రబలే ప్రమాదముందన్నారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎండలకు ఎక్కువగా తిరగరాదని, పనులు చేసేవారు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని సూచించారు. నీటిని వేడి చేసి తాగితే మంచిదన్నారు.

చిట్యాలలో ఘర్షణ.. కేసు నమోదు

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఓ వర్గంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ బోగం లాలప్ప, ముద్దారం మద్దిలేటి, మధు శనివారం రాత్రి 9 గంటల సమయంలో జంగం వీరన్న ఇంటి ముందు ఇసుకలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన నక్క రవి, బోయ సాయి, కామేష్ బైక్‌పై వచ్చి ముద్దారం మద్దిలేటితో 'మీ అన్న కొడుకు ఎక్కడరా వాడిని ఈ రోజు కచ్చితంగా కొడతాం' అంటూ గొడవ పెట్టుకున్నారు. ముగ్గురు కలిసి కొట్టారు. అక్కడే ఉన్న లాలప్ప, మధు విడిపించేందుకు ప్రయత్నించగా పక్కనే ఉన్న ఇటుకలతో దాడి చేయగా ముగ్గురు గాయపడ్డారు. అమ్మాయిల ఫొటోలు వాట్సప్‌లో షేర్ చేయడంపై మద్దిలేటి అన్న కొడుకు ముద్దారం మహేష్, కామేష్ మధ్య గొడవ జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. బాధితుడు బోగం లాలప్ప ఫిర్యాదు మేరకు నక్క రవి, బోయ సాయి, కామేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.



నాడు: గజ్జహళ్లి ప్రభుత్వ పాఠశాల ముందు దిబ్బలు, అపరిశుభ్రత



నేడు: కొత్త రూపును సంతరించుకున్న పాఠశాల

మారిన పాఠశాల రూపు

హొళగుంద: ఈ చిత్రాల్లో కనిపిస్తున్న ఫొటోలు గజ్జహళ్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ముందు భాగం. గతంతో చెత్తాచెదారం, పెంటదిబ్బలు, పగిలిన గాజులు, పెంకులు ఇలా ఒకటేమిటి నానా రకాల దుర్గంధంతో ముక్కు ముసుకుని పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. నాడు పాఠశాల రూపురేఖలు మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి వైపు దూసుకెళ్తున్నాయి. 'నాడు–నేడు' కార్యక్రమంతో మరింత కళను సంతరించుకుంది. ఇక్కడ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. నాడు–నేడుతో నిధులు మంజూరు కావడం, నిర్మాణంలో భాగంగా అదనపు గదుల పనులు సాగుతున్నాయి. పాఠశాలలో ఫర్నిచర్, ఫ్యాన్స్, తాగునీరు, సింక్, టాయిలెట్ తదితర వస తులు కల్పించనున్నారు. దాదాపు రూ.3 కోట్లతో నా డు–నేడు కింద పాఠశాల కొత్త రూపును సంతరించుకోనుంది. కాంపౌండ్ వాల్, తరగతి గదులు, వసతులు ఇతర అనేక సదుపాయాలతో పాఠశాల రూపు మారనుంది.

అందరూ సంయమనం పాటించాలి



రాజకీయ పార్టీల నాయకులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

దేవనకొండ: ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు అందరూ సంయమనం పాటించాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో డీఎస్పీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ ఉంటుందని, ఆ రోజున ఎలాంటి బాణసంచా, డప్పులు, డీజే సౌండ్స్, ఈలలు, కేకలు వేయడానికి వీలు లేదన్నారు. 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు ఎవరైనా బాణసంచా కాలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. బాణసంచా నిర్వాహకులు అమ్మరాదన్నారు. ఒకవేళ అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బైండోవర్ కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎలక్షన్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సీఐ శ్రీనివాసులు, రాజారామ్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

ఆలూరు: ఎన్నికల ఫలితాల సమయంలో కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఓబులేశు అన్నారు. ఆదివారం ఆలూరులో ప్రచారం చేశారు. గెలిచినా.. ఓడినా సంయమనం పాటించాలని సూచించారు. ఈ నెల 4వ తేదీ కౌంటింగ్ రోజున అవసరం లేకుండా ఇంటి నుంచి బయటకు రావద్దని తెలిపారు. 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. నలుగురికి మించి గుమిగూడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఘర్షణలకు పాల్పితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఫలితాలు వచ్చాక ర్యాలీలు, బాణసంచా పేలుళ్లు, డీజేలు వద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని కోరారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

మద్దికెర: ఈ నెల 4వ తేదీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌బాబు అన్నారు. గెలుపోటములు ఎలా ఉన్నా పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. బాణాసంచా పేల్చినా, గుంపులుగా ఉన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.



బిణిగేరిలో గొర్రు కొడుతున్న రైతు

పొలం పనుల్లో రైతున్న బిజీ

ఆస్పరి: ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు వేసేందుకు రైతులు పొలాలను చదును చేసుకుంటున్నారు. ఇప్పటికే కురిసిన మోస్తరు వర్షాలకు కొన్ని గ్రామాల్లో పత్తి విత్తనాలు నాటారు. పొలాలు పదునైతే వేరుశనగ విత్తనాలు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ముందస్తుగా ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా మండలంలోని ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, చిగిళి, బిణిగేరి, నగరూరు, తంగడరడోణ, తురువగల్లు, బిల్లేకల్లు, ముత్తుకూరు, కై రుప్పల, ములుగుందం, బనవనూరు, కారుమంచి గ్రామాల్లో రాయితీ కింద 950 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈసారి సజ్జ, కొర్ర, కంది పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.


కర్ణాటక మద్యం పట్టివేత


ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మంత్రాలయం మండలంలో కర్ణాటక మద్యంను పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆదివారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో పట్టుబడిన మద్యంను మీడియాకు చూయించారు. ఆయన మాట్లాడుతూ మంత్రాలయం మండలం కగ్గల్ క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం కలిగి ఉన్న కగ్గల్‌కు చెందిన బోయ రవిని అరెస్ట్ చేసి 230 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.15 వేలు ఉంటుందని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా తన సెల్ నెంబర్ 94409 02579కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. తనిఖీల్లో కర్నూలు సెబ్ డీటీఎఫ్ సీఐ నర్సానాయుడు, ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యంను చూపుతున్న సెబ్ ఎస్‌ఐ సత్యనారాయణ

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు





మాచాపురంలో ఇంటి మిద్దెపై వెళ్లిన విద్యుత్ తీగలు, మాచాపురంలో అందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

దేవనకొండ: మండలంలోని మాచాపురం గ్రామంలో విద్యుత్ తీగలు అందే ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గతంలో పలుమార్లు విద్యుత్ తీగల ఎత్తును పెంచాలని విద్యుత్‌శాఖ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇంటిపై కప్పులకు ఆనుకుని చాలా చోట్ల విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, ఇప్పటికైనా విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించి వాటి ఎత్తును పెంచాలని కోరుతున్నారు. అలాగే గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని, చుట్టూ ముళ్ల కంచెను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.





జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, సింహ నంది నాట్యం చేస్తున్న దేవిశ్రీ

నృత్యోత్సవ సంబరం

కర్నూలు కల్చరల్: శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. నృత్య శిక్షకురాలు దేవీ శ్రీ ప్రదర్శించిన సింహ నంది నాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకు ముందు విశ్రాంత ప్రిన్సిపాల్ కొట్టే చెన్నయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళా నిలయం వ్యవస్థాపకులు నాగమల్లేశ్వరి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు.

అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి హెచ్చరించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందుల షాపుల ముందు నిల్వ, ధరలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ అధికారుల నుంచి స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు ధ్రువీకరించుకోవాలని సూచించారు. విత్తనాలకు సంబంధించి సోర్స్ సర్టిఫికెట్, ఇతర వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన ఉత్పత్తులకు తప్పనిసరిగా రసీదు తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నకిలీతో జాగ్రత్త

- మార్కెట్‌లో నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాల బెడద
- ఖరీఫ్ సాగుకు అమ్మకానికి ఏర్పాట్లు
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న వ్యవసాయశాఖ అధికారులు



గతంలో పట్టుబడిన నకిలీ విత్తనాల ప్యాకెట్లు(ఫైల్)

హొళగుంద: త్వరలో ఖరీఫ్ సీజన్ మొదలు కానుంది. రైతులు సేద్యానికి సిద్ధమవుతున్నారు. తొలకరి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం అనేక రకాల చర్యలు తీసుకుంటున్నప్పటికి.. మార్కెట్‌లో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా చలామణిలో ఉన్నాయి. ఈ విషయం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుని అన్ని వివరాలను పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోళ్లలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుందాం..

- లైసెన్సు లేని వ్యక్తులు, దుకాణాలు, దళారులు, ఇతరత్రా వ్యాపారుల నుంచి కొనుగోలు చేయకూడదు.
- సరుకు లాట్ నంబర్, తయారీ తేదీ, రకం ఇలా అన్ని వివరాలు కలిగి ఉంటేనే కోనాలి. సంతకం చేసిన బిల్లును విక్రయదారుల నుంచి తప్పనిసరిగా పొందాలి.
- సంచులపై సీలు విప్పినట్లు లేదా విప్పదీసి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే కొనకూడదు.
- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బస్తాలో లభించే చీటీ (ట్యాగ్) ఉందో లేదో గమనించాలి. చీటీ ఉంటేనే కొనుగోలు చేయాలి. ఆ చీటీని ఏడాది పాటు భద్రంగా ఉంచుకోవాలి.
- క్రిమి సంహారక మందుల డబ్బాపై కంపెనీ పేరు, తయారీ తేదీ, కాల పరిమితిని గమనించి అందుకు అనుగుణంగా బిల్లులు తీసుకోవాలి.
- ఏదీ ఎంత ధరకు కొన్నా డీలర్ లేదా దుకాణదారుడి సంతకంతో బిల్లు పొందాలి. నకిలీవని అనుమానం వస్తే మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. ఉచితంగా నకిలీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చు.
- లైసెన్సు లేకుండా విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.
- నకిలీవి అని తేలితే విత్తనం, ఎరువులు, క్రిమిసంహారక చట్టాల ప్రకారం సంబంధిత డీలరు, కంపెనీ దుకాణదారునిపై కేసు నమోదు చేస్తారు.

అనుమతి లేని విత్తనాలు కొనుగోలు చేయొద్దు



ప్రభుత్వం అనుమతి లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేసి మోసపోవద్దు. బ్యాచ్ నంబర్ లేని పురుగు మందులు కొనుగోలు చేయొద్దు. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిని సంప్రదించాలి. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా దుకాణదారుడి నుంచి బిల్లు తీసుకోవాలి.

–ఆనంద్ లోకదళ్, వ్యవసాయాధికారి, హొళగుంద



నకిలీ విత్తనాల బస్తాలు (ఫైల్)